వితాల విశ్వనాథశాస్త్రిగారు

రషీదా యుక్తవయస్సున నున్న నవ యౌవనవిలాసవతి. ఆమె దేహము కలువను మించిన కాంతియు గులాబిపూవును బోలిన నిర్మలమైనదిగాను యొప్పుచుండెను. కెరటములబోలిన నొక్కునొక్కులచే విలసిల్లు యామెకురులు భుజములమీదనుండి పిరుదల నంటుచున్నవి. ముంగురులు కనుబొమల మీద బడుటచే నూత్నవికాసమును గూర్చుచున్నవి.

బంగారువన్నెగల్గిన పట్టుచొక్కాయిని ధరించి పలువిధములైన ఫణులతోనిండిన నల్లనిచీర యగ్రభాగము భుజమునుండి క్రిందకుజారుచు యామె యనాదరణము జూపుచున్నది. పచ్చనిపాదములకు యామె ధరించిన యెర్రనిజోళ్లు ముద్దులగొల్పుచుండెను.

యంగసౌష్టవము గ॥ యొక నిండైన విగ్రహము యామె యెదుట నిలువబడి యుండెను. రషీదా ఆతని నేదియో వేడుకొనుచుండెను. "నా రహస్యమును నీవెట్లు గ్రహించగల్గితివి" అని యావ్యక్తి ప్రశ్నించెను.

"గ్రహించుట కష్టసాధ్యమేకాని దైవవశమున నాకు దెలియవచ్చినది" అని రషీదాపల్కెను.

"సరియే నీవు చెప్పబోవునదేమి" యని పురుషుడు కఠోరముగ పల్కెను.

"తండ్రీ నీవిప్పుడు నిజముగా చంపనెంచితివా" అని రషీదా దీనముగ పల్కెను.

"నోరుమూయుము" తండ్రి గద్దించెను.

"అయ్యో తండ్రీ! ఆతడు మన ప్రభువు కాడా?— కరుణార్ద్రహృదయుడే నిష్పక్షపాతియే మతోద్ధారకుడే! నిక్కముగా నాకే వేయిజీవములున్న ప్రతిదానిని యాతనికి కల్గెడి యే చిన్నయాపదనుండియు రక్షించుటకే ధారవోయుదును – తండ్రీ నీ యుద్దేశ్యమును మానుము." రషీదా వేడుకొనెను.

"ఆతని జంపక దప్పదు" పురుషుడు పల్కెను.

"నీవు నాకుమాత్రమే తండ్రివి కాని యాతడు లక్షలాదిజీవములకు తండ్రి. ఆతని ప్రాణము విలువయైనదికాదా?" నిట్టూర్పు విడచి "తండ్రీ! క్షమింపుము. నీవు నిక్కముగా దేవునియడల ద్రోహము దలపెట్టితివి. దేశమున కరిష్టమును దెచ్చుచున్నావు."

ఆతనిముఖ మెఱ్ఱబారెను.

"పొమ్మావల. జనానా నీ వుండదగినది" తండ్రి కుపితుడయ్యెను.

రషీదా కను లశ్రుపూరితము లయ్యెను.

"తండ్రీ! నాప్రియమైనతండ్రీ! నన్ను కరుణింపుము. రాజభక్తిని దలంపుము. దైవమును మదినెంచుము. మాతృభూమిని కాపాడుము. పాపపుణ్యములు – నీత్యా

వినీత్యములు గ్రహించుము తండ్రి అక్బరును బ్రతుకనిమ్ము" రషీదా తండ్రి కాళ్లంటెను.

"ఛీ! నీచురాలా" అని తన్ని కోపముతో గదివిడిచి ఎచ్చటకోపోయెను. రషీదా హృదయ మాందోళనజెందెను.

జయచిహ్నముగా నిర్మింపబడిన కుతుబ్ మినార్ ఢిల్లీ కనతిదూరములోనేయుండెను. దానియగ్రము యాకాశము తాకుచున్నదో యనునట్లుండెను. దాని పరిసరప్రాంత మంతయు పెనువృక్షములచే దట్టముగా నిండి యుండెను. యచ్చటచ్చటమాత్రము కను చూపు దూరములో నివాసగృహములు మాత్రముండెను. సాయంసమయమగుటచే జనసంచారము లేక నిర్మానుష్యమైయుండెను. కాని గూళ్లకు జేరుకొనుపక్షుల కిల కిలారావముల ధ్వని మిక్కుటముగానుండెను. సూర్యభగవానుడు పూర్తిగా యస్తమించెను. చంద్రుడు తన కిరణజాలము వ్యాప్తి జేయుచుండెను తారాబృంద మొక్కొక్కటియే బయలుబడుచుండెను.

అత్తరి నొకవ్యక్తి అశ్వారూఢుడయి ఒంటరిగా కుతుబ్ మినార్ ముఖద్వారమున కేతెంచెను. వ్యక్తిని జూడ మిగుల యుత్తముడుగ దోచుచుండెనుకాని యాతని విగ్రహముమాత్రము మిగుల విస్మయము గొల్పుచుండెను. గుఱ్ఱముపైనున్న యాతని తీరును జూడ గుఱ్ఱపుస్వారియందు దారితేరినట్లు జెప్పకజెప్పుచుండెను. అంతట యా వ్యక్తి రోజుచు మెల్లిగానడచుచున్న యాతని గుఱ్ఱముదిగి మెల్లిగా కుతుబ్ మినార్ లోనికి బోవుటకై మెట్లెక్కుచు ప్రకృతి సౌందర్యము జూచుచుండెను.

యిదియంతయు జాగరూకతతో గ్రహించుచుండిన యొకవ్యక్తి వృక్షముల చాటున నుండి యాతని వెన్నాడుచు కలసికొని తన మొలనున్న బాకునుతీసి "చావుము మహమ్మదీయ విధ్వంసకుడా" అని గద్దించెను.

మెరపుతీగవలె తటాలున నొకవ్యక్తి వెనుకనుండివచ్చి యాతనిచేయి వెనుకకు లాగెను అంతట ద్రోహి వెనుకకు దిరుగ అక్బర్ ఆతనిచేతనున్న బాకు నూడబెరకి యాతని నిరాయుధునిగా నొనర్చెను.

వెంటనే హయారూఢులయిన మొగల్ యోధులు యచ్చోటి కరుదెంచి యా ద్రోహిని ముట్టడించిరి.

"రహిమాన్! ఈహంతకుని చేజిక్కించుకొనుటకు మంచిసమయమునకే విచ్చేసితివి. అల్లా నిన్ను రక్షించుగాక" యని దీవించెను. రహిమాన్ గౌరవపూర్వకముగా అక్బరునకు వంగి

"రాజా ద్రోహులు కాకరమైయున్న యిచ్చోటునకు తమ రొంటరిగా వచ్చుట వినియుండి తమ రక్షణార్థమై వచ్చియుండుట మంచిదని తలంచితిని."

"ఆనూత్న వ్యక్తిమూలమున బ్రతికితిని. లేకున్న యీపాటికి వధింపబడియుందు" నని అక్బరుపాదుషా యానూత్నవ్యక్తి కొరకై మెట్లు డిగెను. నూత్న వ్యక్తి

మాయమయ్యెను. కలయ వెదకిరికాని కాంచనైరి.

మరునాటి యుదయమున అక్బరు స్వయముగా ద్రోహివిషయమై తీర్పును జెప్పుటకై నిండుకొలువున తన యుత్తమాసనము నధిష్ఠించెను. పాదుషాప్రియులైన అబుల్ ఫజిల్ యొకవైపునను మానసింహు డొకవైపునను రాజదుస్తులలో యుచితాసనముల నాసీనులై యుండిరి. తదితరహిందూ మహమ్మదీయ మహామంత్రులును, పెక్కు యాస్థానో గుద్యోగులును, చూపరులును తమతమ స్థానములందుండిరి. ఇట్టి నిండుసభా మధ్యమున అక్బరుముఖమున రాజఠీవియు మూర్తీభవించిన ధర్మమును యావరించియుండెను.

ఆత్మగౌరవమున కొవంతము లోటురానీయక తానొనర్చిన తప్పిదమునకై తలవంచుకొని ఖడ్గధారులయిన యిరువురుయోధుల మధ్య ద్రోహి నిలువంబడి కొలువంతయు తనవైపునకు ద్రిప్పుకొనియుండెను.

అబుల్ ఫజల్ లేచి నేరారోపణపత్రమును జదివి హంతకుని జెప్పుకొనదగిన నేదైన యున్నదేమో యడిగెను

హంతకుడు మాట్లాడలేదు.

"నీయిష్టదైవమును దలంచుకొమ్ము. నీవిప్పుడే మరణమందెదవు" అని మరలఅబుల్ ఫజిల్ ద్రోహి నుద్దేశించిబల్కెను.

ద్రోహి బలుకలేదు

మరణదండన విధించుశిక్షాపత్రము వ్రాయబడెను. దానిపై నక్బరు సంతకమును జేయుగా రాజముద్ర వేయుబడెను.

అంతట నొక ద్వారపాలకు డేతెంచి అక్బరునకువంగి

"మహారాజా! యెవ్వరో యొకవ్యక్తి తమ దర్శన మపేక్షించుచున్నాడు."

"ఎవరాత్డు ఏమికావలయు"ననిఅక్బరు ప్రశ్నించెను.

"అయ్యా ఆవిషయమేమియు నాతో జెప్పకున్నవాడు" అనెను.

అక్బరు ద్రోహిని ప్రక్కనున్నగదిలో బెట్టించి వేచియున్నవ్యక్తిని రానాజ్ఞాపించెను.

వ్యక్తి ఇడలేని యడుగులతో లోనప్రవేశించుచుండెను.

అక్బరు వెంటనే తన స్థానమునుండిలేచి చేతులుచాచి "మిత్రమారమ్ము నాప్రక్కను గూర్చుండుము" అని వెర్రియానందముతో యాదరించెను.

ఆవ్యక్తిపీఠమునకు కొంచెము దూరమున నిలువంబడి ప్రణామము లాచరించి "ఆర్యా! క్షమింపుడు. నాకొకచిన్నవరము

"మిత్రమా! నీకేమి కావలయును. యుద్యోగమా?-అధికారమా?-ధనమా?" అని యాతురతలో యడిగెను.

"మరేమి? తక్షణమే వేడికొనుము యీ అక్బర్ సంసిద్ధుడైయున్నవాడు"

"తమనోట యొక క్షమార్పణమాటయే" వ్యక్తిబాధచే రోజుచుండెను.

అక్బరువ్యక్తిని వెర్రిగా జూచుచు "క్షమార్పణ" అని తెల్లబోయెను.

"అంతియే! తమను , వధింపదలచిన యాతని క్షమించుటయే!" వ్యక్తిపల్కెను. సభయంతయు విస్మయమందెను. అక్బరు మం మాందోళనజెందెను.

"అతడు ద్రోహి. నాప్రాణములు దీయ నెంచెను"

"తమను నేను రక్షించితిని. యిట్లు పల్కినందులకు క్షమింపుడు. నాకోర్కె మించియున్నదా?"—

"అక్బరువలె నీకోర్కె దీర్పగలను కాని చక్రవర్తిగా నీయజాలను నే ద్రోహియైన నన్నైనను శిక్షించుకొనవలనదే" అక్బరు పల్కెను.

"తమను రక్షించుటలోనే గాయములందితిని దానికి ఫలితముగా నేనిప్పుడు జావనుంటిని" వ్యక్తిపల్కెను.

"మిత్రమా! లోకమున గొప్పవైద్యుడు నీకు పరిచర్యలొనగలుగు" అక్బరనెను.

"యిక నన్నెవరెను రక్షింపజాలరు. తమకై ఏర్పరుపబడిన బాకు విషపూరితమైనది. గాయము కొంచెమైనను బాధ భరింపరానిది." వ్యక్తి నిశ్చేష్టితుండగుచుండెను.

"నాకిక కొలది నిముసములుమాత్రమే యున్నవి, రాజా! నాకోర్కె నెరవేర్పుడు నా తండ్రిని బ్రతికింపుడు. అల్లా తమ్ము నెల్లప్పుడు కృపజూచును" అని దీనముగా చేతులు జాపెను. అశ్రువులరాల్చెను. కొలువంతయు కరగిపోయెను.

విషమంత కంతకు పనిచేయదొడగెను. ముద్దులమోమున నీలమువ్యాపింపదొడగెను. అక్బరు తన్నుతానే మరచెను. హృదయము కరగిపోయెను. కనుల నశ్రువులు వ్యాపించెను. తక్షణమే వణకుచున్న హస్తములతో నాజ్ఞాపత్రము చింపివైచెను.

యువకునికాళ్లు తడబడుచుండెను. అక్బరు పీఠమునుండి పర్వెత్తి నావ్యక్తిని బట్టుకొని అదరెడు పెదవులతో "మానసింహా! వైద్యుని పిలువింపు" మనెను.

మానసింహుడు తక్షణమే వైద్యునికై పర్వెత్తెను. వ్యక్తి అక్బరు నాధారముజేసికొని మెల్లగ పాదములపైబడి ముద్దిడుకొని వణకుచు రాజా! నన్నాతని జూడనిమ్ము" అని దీనముగా వేడెను. వెంటనే అక్బరు ద్రోహి నచ్చోటికి దే నాజ్ఞాపించెను.

ద్రోహివచ్చుట తడవుగా అతి ప్రయాసముతో "తండ్రీ" అని యాతనిమీద వ్రాలెను.

"బిడ్డా! రషీదా" యని ద్రోహికంట తడి పెట్టుచు కూతును పొత్తిళ్లలో హత్తుకొనెను.

రషీదా తలనున్నపాగా క్రిందబడెను. ముఖమంతకంతకు నీలిమయ్యెను.

"అక్బర్ .." అని రషీదాయేమో జెప్ప బోయెను. అక్బరు వినుటకువేచి యుండెను. రషీదాకుమాటలేదు. రషీదా తండ్రిచేతులకు బరువయ్యెను. "రషీదా" యని ద్రోహియొక్క పెట్టున యేడ్చెను. అక్బర్ నిశ్చేష్టుడయ్యెను.